ఆదివారం

ప్రజాశక్తి

ఏప్రిల్ 6, 2003

సైబర్ నేరస్థులకు సవాల్

హ్యాపీ బర్త్‌డే

(6-4-2003 నుండి 12-4-2003 వరకు)

బండి పవన్‌కుమార్
4సం॥, ఏప్రిల్-1999
విజయలక్ష్మి-దుర్గాప్రసాద్
రామలింగేశ్వర నగర్-విజయవాడ

గాదె రాజేష్ సబిత
దేవరకొండ-నల్లగొండ

జి.వాసంత్
2॥సం,6. 4. 2001
శ్రీవాణి-వీరరాఘవ
సందెపూడి-గుంటూరు

ఎం.డి.తైసిన్
3॥సం,6. 4. 2000
రజియా-ఖాదర్
ఇబ్రహీంపట్నం-రంగారెడ్డి



పి.శ్రావణి
లక్ష్మి-అప్పారావు
నర్సీపట్నం-విశాఖపట్నం

హిమతులసి
2॥సం,9. 4. 2001
ముత్యావతి-ఉమామహేశ్వరరావు
పెదపట్నంలంక-తూర్పుగోదావరి

రేష్మాప్రశాంతి
3॥సం,9. 4. 2001
పార్వతి-శంకరరావు
మలాట్కపురం-విశాఖపట్నం

గడిచే కొద్దీ నియంత్రణ ఏర్పడి, ఈ సమస్య తగ్గి ముఖం పడుతుంది. సాధారణంగా బట్టలు తడుపుకొంటే, పిల్లలు ఎంత నిద్రలో వున్నానరే, డిన్కమ్ఫర్ట్‌కు లోనై ఏడవడం జరుగుతుంది. పక్క బట్టలు తడిసిన వెంటనే మారుస్తూ వుంటే, మరల నిద్రలోకి జారుకుంటారు.

ఇకపోతే, పిల్లలు తరుచుగా ఏడవడానికి మరో ముఖ్య కారణం - జలుబు. ఎక్కువ శాతం పిల్లలకు తరచుగా జలుబు చేస్తుంది. జలుబు చేసినపుడు ముక్కులు మూసుకుపోయి, గాలి పీల్చుకోవడం కష్టమవుతుంది. ఇలాంటప్పుడు కూడా పిల్లలు అదే పనిగా ఏడుస్తుంటారు. ఆకలి వల్లేమోనని తల్లి పాలివ్వబోతే పాలు సరిగా తాగలేదు. జలుబు వల్ల ముక్కులు మూసుకుపోతే నోటిద్వారా శ్వాస తీసుకోవడం మనందరికీ తెలిసిన విషయమే. కాని పాలుతాగేటప్పుడు నోరు కూడా మూసుకుపోయి ఊపిరాడక, మధ్యమ వదులుతూ పాలు తాగుతారు. అంతేకాకుండా నోటిద్వారా గాలి తీసుకోవడం వల్ల నోరు ఎండిపోయి వారి బాధను ఎక్కువ చేస్తుంది. ఇలాంటి లక్షణాలు వుంటే ముక్కులు మూసుకుపోయాయని అర్థం చేసుకోవాలి. వెంటనే నాసోక్లియర్ నాసల్ డ్రాప్స్ ఒక్కో చుక్క రెండు ముక్కు రంధ్రాల్లో వేయడం ద్వారా ముక్కు తెరుచుకొని, నిముషాల్లో ఏడుపు ఆపేస్తారు. ఈ చుక్కల మందును ముక్కు మూసుకుపోయిందనిపించినప్పుడల్లా వాడొచ్చు.

ఇక, తరువాత చెప్పుకోదగ్గ కారణం చెవి నొప్పి. ఇది కూడా జలుబు మూలంగానే వస్తుంది. ముక్కును, చెవిని కలిపే యూస్టేషియన్ ట్యూబ్, జలుబు వల్ల మూసుకుపోవడంతో చెవి ఇన్ఫెక్షన్‌కు గురై నొప్పి వస్తుంది. అందుకే చంటి పిల్లలకు చెవి



నొప్పి వస్తే, దానికి రెండు మూడు రోజుల ముందునుంచి జలుబు కూడా వుంటుంది. ఇలాగే వదిలేస్తే, తరువాత చెవిలోంచి చీముకూడా వస్తుంది. చెవి నొప్పో, కాదో తెలుసుకోవడానికి, చెవి రంధ్రానికి దగ్గరగా వేలితో నొక్కినప్పుడు ఏడుపు ఎక్కువ అవుతుంది. ఇలాంటప్పుడు, చెవి నొప్పి వెంటనే తగ్గడానికి OTOGESIC EAR డ్రాప్స్ 2-3 చుక్కలు 4-6 గంటలకొకసారి వేస్తే ఫలితం ఉంటుంది. నొప్పి తగ్గిన తరువాత ఇన్ఫెక్షన్ వుందో లేదో తెలుసుకోవడానికి డాక్టర్ని సంప్రదిస్తే మంచిది. చెవి ద్వారా చీము వస్తుంటే మాత్రం, డాక్టర్ని సంప్రదించి యాంటిబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది.

ఇకపోతే పిల్లలు ఏడిస్తే కడుపు నొప్పేమోనని సాధారణంగా అనుకుంటుంటాం. కాని మనకున్నంత తరచుగా వారికి కడుపు నొప్పి రాదు. కొన్ని విషయాలు పరిశీలించడం ద్వారా కడుపు నొప్పో కాదో తెలుసుకోవచ్చు. కడుపు నొప్పితో పిల్లలు ఏడిస్తే వారిని సముదాయించడం చాలా కష్టం. ఎత్తుకుంటే మెలికలు తిరిగి పోతుంటారు. పడుకోబెడితే కాళ్ళు రెండూ పొట్టకు దగ్గరగా పైకెత్తి ఏడుస్తుంటారు. కాని ఈ ఏడుపు నిరంతరంగా వుండదు. మధ్యమధ్యలో ఆగి, మరలా ఏడుస్తుంటారు. ఎందుకంటే ఈ నొప్పి ఆగి ఆగి వస్తుంది. దీనినే ABDOMINAL colic అంటాము. దీనికి సాధారణంగా డైసైక్లోమిన్ (Colimex, eyclofam) అనే మందును విరివిగా వాడడం జరుగుతుంది. దీనివల్ల నొప్పి తగ్గుతుంది కాని ప్రేవులు పని చేయకపోవడంతో కడుపు ఉబ్బటం లాంటి దుష్పరిణామాలు వుంటాయి. అందుకే ఈ మందును అతి జాగ్రత్తగా, తప్పనిసరి అయినప్పుడే తగు మోతాదులో వాడాలి. ఇలాంటి నొప్పి వచ్చినపుడు, పిల్లల్ని కాసేపు బోర్లా పొట్టమీద పడుకోబెడితే కొంత ఉపశమనం లభిస్తుంది. కొంతసేపటికి నొప్పి దానికదే తగ్గిపోతుంది. అయినా నొప్పి తగ్గకుంటే Cyclofam లేదా Colimese drops 6 నెలల లోపు పిల్లలకి 5-10 చుక్కలు నోట్లో వేయాలి. అలాగే 6 నెలలు - 2 సం॥ల మధ్య పిల్లలకు 10-20 చుక్కలు వేయాలలి. 6 నెలల లోపు పిల్లలకు అత్యవసరమైనపుడే, తగు మోతాదులో మాత్రమే వాడాలి. ఈ వయసు పిల్లలకు వీలైనంత వరకు ఈ మందును వాడకుండా వుంటే మంచిది. (ఇలా ప్రయత్నించినా నొప్పి తగ్గకుంటే, నొప్పికి abdominal colic కాకుండా వేరే కారణం వుండవచ్చు. ఇలాంటప్పుడు వెంటనే డాక్టర్ని సంప్రదించడం మంచిది.)

చంటి పిల్లలు ఏడవడానికి మరో కారణం ప్రేమ ఆప్యాయతలకి, తల్లీ బిడ్డల అనుబంధానికి సంబంధించింది. తల్లి తమ నుంచి దూరంగా వున్నప్పుడు, తల్లి దృష్టిని ఆకర్షించడానికి, వారికి దగ్గరగా వుండాలని వారి ఆప్యాయతను పొందాలన్న తపనతో పసి పిల్లలు ఏడుస్తారు. కొందరు పిల్లలైతే తల్లి ప్రేమమయ స్పర్శను పొందడానికి పక్క తడుపుకొని బిగ్గరగా ఏడుస్తారు. తల్లి వచ్చి పక్క బట్టలు మార్చి, ఎత్తుకొని లాలిస్తే బోసి నవ్వులు నవ్వుతారు. వీరి అమాయక నవ్వుల వెనుక కొంత కొంటెతనం కూడా దాగుంది సుమండీ!

మనమెన్ని కారణాల గురించి చర్చించుకున్నా పసిపిల్లల ఏడుపు ఒక్కోసారి మిస్టరీగానే మిగిలిపోతుంది. కాని మనం ఇక్కడ చెప్పుకున్న కారణాలన్నింటిని దృష్టిలో పెట్టుకుంటే చాలా సందర్భాల్లో ఏడుస్తున్న పిల్లల కష్టాన్ని తెలుసుకొని, వెంటనే ఇంటిలోనే వారి కష్టాన్ని దూరం చేసే ప్రయత్నం చేయవచ్చు. పైన చెప్పిన విషయాలను పాటిస్తే 90 శాతం సమస్యల్ని పరిష్కరించ వచ్చు. ఇకపై మీ పాపో, బాబో ఏడిస్తే ఆందోళన పడకండి, ఆలోచించండి.

ఆల్ ద బెస్ట్. ◆

హైదరాబాద్ ఆటోవాలా

✻ అంపశయ్య నవీన్

సౌతాఫ్రికాలో జరుగుతున్న క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ రేపు జరుగుతుందనగా అంటే మార్చి 22 నాడు నేనో పని మీద హైదరాబాద్ వచ్చాను. ఆ రోజు రాత్రి పది గంటలకు బోయినపల్లిలో ఉన్న మా బంధువులింటికెళ్ళి తార్నాకలో ఉన్న మా అబ్బాయింటికొస్తున్నాను. మెయిన్‌రోడ్డు మీదికొచ్చాక ఖాళీగా వెళ్తున్న ఓ ఆటోను ఆపి 'తార్నాకకొస్తావా?' అన్నాను.

"రాత్రి పదిదాటింది కదసార్.. మీటర్ మీద ఇంకో హాఫిస్తే వస్తా" అన్నాడు.

'సరే' అని అతని ఆటో ఎక్కి కూర్చున్నాను. సాధారణంగా ఆటో డ్రైవర్లు ప్రయాణీకులతో ఎక్కువగా మాట్లాడరు. కానీ నేను ఈ ఆటోలో కూర్చున్న మరుక్షణం నుండి ఈ ఆటోవాలా నాతో ఒక్క క్షణం కూడా ఊరుకోకుండా ముచ్చటించటం మొదలెట్టాడు.

"రేపు క్రికెట్ కప్ ఫైనల్ ఎన్నింటికి సార్!" అన్నాడు.

"రేపు మధ్యాహ్నం ఒకటిన్నరకు" అన్నాను.

"అయితే రేపు ఒంటిగంట తర్వాత నాకేం గిరాకుండదు.. ఒంటి గంటకాగానే ఇంటికి బోవాలె" అన్నాడతడు.

"ఇంత మహాపట్టణంలో ఒంటిగంట తర్వాత ఆటో ఎక్కేవాళ్ళే ఉండరంటావా?" అన్నాను.

"ఉండరు సార్.. మొన్న పాకిస్తాన్‌తోటి మనోళ్ళు ఆడిన రోజు సిటీ అంతా కర్ఫ్యూ పెట్టినట్టుండెసార్.. ఆ రోజు నా కస్సలు కలెక్షన్నే లేకుండె... ఈ జనాలకు క్రికెట్టంటె గింత పిచ్చెందుకుసార్!" అన్నాడతడు. "చెప్పడం కొంచెం కష్టమే. కాని రోజుకు నువ్వెంత సంపాదిస్తావోయ్?"అన్నాను.

"మామూలుగా అయితే ఓ మూడొందలు ఎక్కడబోవుసార్"

"ఆ మూడొందలతో ఏం జేస్తవు? ఈ ఆటో నీ స్వంతమేనా?"

"స్వంతమేసార్! మూడు వందలల్ల వంద రూపాయలు పెట్రోల్‌కు బోతయి... ఇంకో వంద రూపాయలు చిట్టీకడ్త... చిట్టీ ఎత్తే ఈ ఆటోకొన్న... పోతే మిగిలిన వంద ఇంటికి పట్టుకపోత"

"నీ కుటుంబాన్ని పోషించుకోవడానికి ఆ వంద సరిపోతాయా?"

"మొన్నటి దాకా సరిపోయేది సార్... గీ చంద్రబాబు నాయుడు కరెంట్ రేట్లు పెంచిండు చూడుండ్రి.. అప్పట్నించి సరిపోతలేవుసార్.. మొన్న అమెరికావోడు ఇరాక్‌మీద యుద్ధజేసుడు మొదలు బెట్టె - దాంతోటి పెట్రోల్ ధరలు మల్ల పెరిగె.. ఇంకెన్నిసార్లు పెరుగుతాయో... అమెరికావోడు ఇరాక్‌మీద యుద్ధం జేసుడు న్యాయమేనా సార్! తెలిసినోళ్ళు మీరు జెప్పుండ్రి"

"న్యాయం కాదు ఏ రకంగా జూసినా న్యాయం కాదు.. ఇదో అక్రమ, అధర్మ అన్యాయ యుద్ధం. మైట్ ఈజ్ రైట్ అంటారు చూడు.. లాఠీ ఉన్నోందే బర్రె అని ఉర్దూల ఓ సామెతుంది... అమెరికోని చేతుల లాఠీ ఉంది... ప్రపంచమంత నాదే అంటాడు. పూర్వం హిట్లర్ ఇట్లనే చేసిండు. చివరకు మట్టిగరిచిండు. బుష్‌గాని గూడ అట్లనే కావాలె"

"కావాలెగాని.. అయితదా సార్?"

"చూద్దాం.. అన్యాయం ఎప్పుడూ గెలవకూడదు"

"మీరేమన్న అనుండ్రి! గీయనైతే పోవాలె సార్"

"గీయనంటెవరు?"

"మనోడే.. చంద్రబాబు నాయుడు"

"ఇష్టమొచ్చినట్టు చేస్తాండు సార్... కరెంట్ రేట్లు పెంచిండా! మా ఆటోవోళ్ళను కొన్ని రూట్లల్ల తిరగొద్దంటున్నాడు.. పోలీసోళ్ళను మా మీదికి ఉసిగొల్పిండు.. వాళ్ళు మా మీద చాలా జులుం జేస్తున్నారు సార్.. మొన్న మేం స్ట్రైక్ జేసి ఎంత నష్టపోయినమనుకున్నారు? వాడెవ్వడో ప్రపంచ బ్యాంకోడున్నాడట కద.. వాడెట్ల ఆడిస్తె గీయన అట్ల ఆడ్తున్నాడని జెప్తున్నారు... నిజమేనా సార్!"

"అప్పులిచ్చినోడు చెప్పినట్టు వినుడు మన సమాజంల ఉన్నదే కదా!"

"గదంత పోనీయండ్రి గాని రేపు మనోళ్ళు ఆస్ట్రేలియా మీద గెలుస్తరాసార్.. అబ్బో! ఆస్ట్రేలియావోడంటె తక్కువోడా సార్! వాన్ని ఓడిచ్చుడు మనోళ్ళతోటయితదంటరా?"

"నీకేమనిపిస్తున్నది?"

"మనోళ్ళు ఓడిపోతరు సార్..."

"చాలా మంది జ్యోతిష్కులు మనోళ్ళు గెలుస్తరని జోస్యం చెప్పిండ్రు.. న్యూమరాలజీ అని నెంబర్ల శాస్త్రమట... వాళ్ళు కూడా ఇండియా గెలుస్తుందని బల్లగుద్ది చెప్పిండ్రు. మన విశ్వహిందు పరిషత్తోళ్ళు యజ్ఞాలు చేసిండ్రు... పూజలు, వ్రతాలు చేసిండ్రు.. ఊరేగింపులు తీసిండ్రు..

"గయ్యన్ని జేస్తే మ్యాచులు గెలుస్తరా సార్! మంత్రాలకు చింతకాయలు రాల్తయా సార్!"

"చాలా కరెక్ట్‌గా చెప్పినవు.. నువ్వేం చదువుకున్నావు బాబూ!"

"నేనా సార్! మెట్రిక్ ఫెయిలయ్యా"

"మహామహా మేధావులకంటే నువ్వు చాలా బెటర్.. చాలా సైంటిఫిక్‌గా ఆలోచిస్తున్నావు"

"ఏమోసార్.. నాకు గదంతా తెల్వదు..."

"మీదేవూరు బాబూ?"

"మాది వైజాగ్ సార్"

"మీది వైజాగా? తెలంగాణా మాండలికం ఇంతచక్కగా ఎట్ల మాట్లాడుతున్నావు?"

"నేనిక్కడికొచ్చి ఇరవయ్యేళ్ళయింది సార్. ఎక్కడుంటే అక్కడి తీర్థ ఉండాలన్నది నా పాలసీ సార్...!!"

"వెరీగుడ్.. నీతో సాగించిన సంభాషణ చాలా బావుంది"

ఈ లోపల తార్నాక వచ్చేసింది. అతనికి "థాంక్యూ" అంటూ డబ్బులిచ్చేసి మా అబ్బాయి ఇంట్లోకెళ్ళాను. ◆

అద్భుతారా!

ఏది మంచిది?

ఓ సారి ఒక వ్యక్తికి ఒక అనుమానం వచ్చింది. అబ్బో భయంకరమైన అనుమానం లెండి. అదేంటంటే... శవాన్ని శ్మశానానికి తీసుకెళతారుకదా. అప్పుడు శవానికి ఎడమవైపు నడవాలా! కుడివైపు నడవాలా? ఇది ఆయనగారి అనుమానం. చాలా మందిని అడిగి చూశాడు. కొంతమంది కుడి వైపు వెళితే మంచిదని చెప్పారు. కొందరైతే ఎడమవైపు నడిస్తే శుభం అని చెప్పారు. కాని అందుకు కారణాలను వెల్లడించలేకపోయారు. కొందరైతే ఆ ప్రశ్న వేసిన వ్యక్తిని పిచ్చివాడిని చూచినట్టు చూశారు. అయినా వట్టు వదలని విక్రమార్కునిలా తన అనుమానాన్ని జనాల ముందు పెడుతూనే వున్నాడు. చివరికి ఓ వ్యక్తి 'నీ ప్రశ్నకు సమాధానం చెప్పలేనుకానీ.... చెప్పే వ్యక్తి పేరు చెప్పగలను' అన్నాడు. 'ఎవరో త్వరగా చెప్పు' అని ఆదుర్దాగా అడిగాడు. 'ఇంకెవరు నసీరుద్దీన్' అన్నాడు. అంతే వెంటనే నసీరుద్దీన్ గ్రామానికి ప్రయాణమయ్యాడు. ఎట్టకేలకు నసీరుద్దీన్‌ను కలుసుకున్నాడు. ఎప్పటినుంచో తనను పీడిస్తున్న అనుమానాన్ని నసీరుద్దీన్ ముందు వుంచాడు. 'శవానికి ఎడమవైపు నడిస్తే మంచిదా? కుడివైపు నడిస్తే మంచిదా? అన్నదే నీ ప్రశ్నకదా. నే చెప్పేది జాగ్రత్తగా విను. శవపేటికమీద కాకుండా ఎటువైపు అయినా ఇబ్బందిలేదు' అని చెప్పాడు నసీరుద్దీన్.

కోడిగుడ్డు మేజిక్

హలో...

వారం మీకు కోడిగుడ్డు మేజిక్ గురించి టున్నా. ఈ మేజిక్ చేయడానికి మీకు రెండు కోడిగుడ్లు మంచిది. రెండోది పాడైపోయినది.అలాగే రెండు గ్లాసుల డి. ఒక గ్లాసులో మంచి కోడిగుడ్డును మెల్లగా వదలండి. ోతుంది. మరో గ్లాసులో చెడిపోయిన గుడ్డును విడవండి. ు. అంటే కోడిగుడ్డు మంచిదైతే నీటిలో మునుగుతుంది. తే తేలుతుంది. ఇందులో మేజిక్ ఏం లేదు. అసలు ంటే... కోడిగుడ్డు సాంద్రత నీటిసాంద్రతకన్నా ఎక్కువ. ీటిలో మునుగుతుంది. రెండో గ్లాసు నీళ్లల్లో ఉప్పు ు మంచి కోడిగుడ్డు వదలండి. అది తేలుతుంది. 'అర్రే పాడైపోయిందా!' అనిపిస్తుంది. కాని ఉప్పు నీటి సాంద్రత ంద్రత కంటే ఎక్కువ. అదీ కోడిగుడ్డు మేజిక్.

వారం స్టెతస్కోప్ తయారు చేయడం ఎలాగో చెప్తానే.



కలం స్నేహం

పేరు: కె.శ్రీకాంత్,
వయసు : 14 సం॥
చదువు :9 వతరగతి
హాబీలు :క్రికెట్ ఆడడం, కథలు, పేపరు చదవడం, డ్రాయింగ్ వేయడం, డాన్స్ చేయడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : కె.శ్రీకాంత్, సన్నాఫ్ కె.బాలయ్య, ఇ.నెంబరు7-158, హైస్కూల్ ఎదురుగా, వట్టెం, మహబూబ్‌నగర్.

పేరు: జి.ఇందు,
వయసు : 8 సం॥
చదువు :3 వతరగతి
హాబీలు: కథలు చదవడం, బొమ్మలు వేయడం.
పూర్తి చిరునామా : జి.ఇందు, 3వ తరగతి, ప్రగతి మోడల్ స్కూల్, ఖమ్మం.

హాయ్... వేసవి సెలవలు వస్తున్నాయికదా. మీకు 'కలం స్నేహం' చేయాలని వుందా! అయితే ఓ కార్డు తీసుకుని మీ హాబీలు, అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో ఒకటి ఆ కార్డు మీద అంటించి పోస్టు చేయండి.

పదాల పదనిసలు

ఒక్క అక్షరం కలపండి

క	?
వ	
మ	
బ	
స	
గు	

గతవారం జవాబులు

జ	త
పి	
ల	
సు	
శ్రో	
రా	

మూడు గంటల రైలు బండి దిగి వస్తూ వుంటే... కచ్చడం బండి.. అప్పుడే ఆ వూరికొచ్చిన రిక్షాలు... షావుకార్ల సరుకుల మూటలు మోసుకుని పోయి అంతో ఇంతో కూలీ తీసుకునే కూలీలు తమ వాళ్లను రైలు దిగగానే కూడా తీసుకుపోదామని వచ్చిన బంధువులు, వరుసగా.. ఎదురెదురుగా ఉండే హోటళ్లలోని మిర్చీ గారెల ఘుమఘుమలు, కాలేజి నుండి ఇంటి దారి పట్టిన కుర్రాళ్ళ సినిమా కబుర్లతో... రెండు కిలోమీటర్లు నడిచి వచ్చినట్లే లేదు.

* రౌతు రవి

వల్లకాడుగాక... ఏమైద్దీ...!

తెల్లారి పొద్దున్నే లుంగీ సర్దుకుంటూ చెరువు కట్ట ఎక్కి అట్లా చూస్తావుంటే.. బంగారం కనుచూపు మేర పరిచారా ఏంది అన్నట్లుగా వరి పనులు మాగాండ్లలో పరిచిన దృశ్యం ఎంత ఆనందాన్ని కల్గించిందో,... కత్తువ పక్కన సాకల కోటయ్య పొయ్యి బెట్టి పుల్లలేగేసుకుంటూ తేపో బుక్క కల్లు దోక్కుంట_ముచ్చట్లు బెడతంటే... మామిడి తోట మూలన పచ్చగా పెరిగిన ఎదురు పొదల్లోంచి "ఒరేయ్! ఎవితిరా దొరోరి పొలాల్లో గడ్డి కోసేది? ఎన్నిసార్లు జెప్పాలెరా దానికి.." అంటూ దొరగారి గుమస్తా కేకలు. గడ్డి సర్దుకుని "పోతన్న... పోతన్న.." అంటూ వెళ్లే కూలీ తల్లులు, తొణికిసలాడుతూ చల్లని గాలి వీచే చెరువుగట్టు, అక్కడక్కడా బర్రెలపై ఎక్కి చెరువులో ఈదులాడే పిల్లలు. నిజంగా ఆ దృశ్యాలు నన్ను ఒక వారం ఉందామని వచ్చినవాణ్ణి.. నెల రోజులు కదల్నీయలేదు.

◆ ◆ ◆

నాలుగేండ్లు గడిచాయి. పట్నం నుండి అదే మూడు గంటల రైలుబండి దిగితే... ఒకే ఒక్క ఆటో.. పెద్దదే. బస్తాలో కుక్కినట్లు కుక్కి నన్ను కూడా కుక్కుదామని ఎదురుచూస్తూ ఇంజన్ స్టార్ట్ చేసాడు. "నేను నడిచొస్తాన్ బాబు.. నువ్వెళ్లు" అంటూ తోడుగా నడిచే వాళ్ల కోసం అటూ ఇటూ చూసాను. సంచి భుజానేసుకుని మెల్లిగా నడుస్తూ కనిపించాడు షావుకారు రంగయ్య.

"బాగున్నారా బాబాయ్" అంటూ మందలించి



చెరువు కట్ట ఎక్కాను, ఎండిన చెరువు, నెర్రెలిచ్చి మోడుబారిన గెనాలతో నిర్మానుష్యంగా మాగాండ్లు, కూలిపోయిన చాకలి కోటయ్య పొయ్యి మట్టి నాక్కుంటూ కట్ట పొడుగూతా తిరుగాడే ఎముకల గూళ్లు లాంటి పశువులు, బడి దగ్గిర నుండి ఊళ్లోకి వెళ్లే దారిలో తెలిసిన కుటుంబాలు "అయ్యా! ఏవుంది ఊళ్లో...? తాగ నీళ్లు లేవు. గొడ్లకు మేత లేదు. పని లేక తూర్పు బోతన్నం దొరా! మల్లా సూత్తమో లేదో.. ఎన్ని రోజులుంటవయ్యా.. అమ్మ గార్ని గిట్ట అడిగినట్లు జెప్పు" అంటూ రైల్వే స్టేషన్‌కి బయలుదేరిన వాళ్లను చూసి కండ్ల నీళ్లు తిరిగాయి.

ఇంట్లో అమ్మానాన్నా ఎదురుచూస్తున్నారు. పనిజేసేవాళ్లు లేరు. పాడి పంట లేదు. కల్గినోళ్లు గాబట్టి తిండికి తిప్పలేం లేదుగాని చేసేటోడు, మంచీ చెడూ చూసేటోడు, ఊరొదిలి పోతున్నారు. రేపే ఉరిబోసుకుని సచ్చిపోయిన రైతు పుల్లయ్య పెద్ద కర్మలు, బాబాయ్ ఎంత పనిజేసాడు! ఊరుకు ధైర్యం జెప్పే మడిసేనా ఈ పన్జేసింది అంటూ కుర్చీలో కూలబడ్డాను. కర్మలు అయినాయి, పుల్లయ్య బాబాయ్ పిల్లల్ని, చిన్నయ్యను, మందలించి వస్తుంటే దారిలో చెప్పింది అమ్మ ఏడుస్తూ... "పొలం అమ్మినం కొడకా! రెండు రోజులుండి సంతకాలు బెట్టి అందరం పట్నంబోదామని... పొలాలున్నోడూ ఊరొదిలే.. రెక్కలమ్మేటోడూ ఊరొదిలే.. ఊరు.. వల్లకాడుగాక ఏమైద్దీ..." అని. ◆

సచిన్‌పై విమర్శలు సహేతుకమా?

* రాంప్రసాద్. ఎం.కె.

ఒక స్థాయికి చేరుకున్న వారిపై విమర్శలు రావడం కద్దు. వారి బలహీనతలను, కొండొకచో లేని వాటిని ఆపాదించి రాళ్లు వేయడం సహజం. ఇందుకు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్‌కు కూడా మినహాయింపు లేదు. పదహారేళ్ల చిరుప్రాయంలోనే అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రవేశించి రికార్డులపై రికార్డులు సృష్టిస్తూ అలుపెరుగని క్రికెట్ క్రీడాకారునిగా అతడు జగద్విఖ్యాతి చెందాడు. అతడు ఎక్కని మెట్లు లేవు. సాధించని రికార్డులు లేవు. అతడంటే ప్రత్యరియ్థ జట్లకు హడల్. మొన్నకుమొన్న ముగిసిన వరల్డ్‌కప్‌లో ప్రత్యర్థి జట్లన్నీ సచిన్‌పై దృష్టి కేంద్రీకరించాయి. సచిన్‌ను అవుట్ చేయడం ఎలా అనే విషయంపై తలలు బద్దలుకొట్టుకున్నాయి. ఒక్క సచిన్‌ను అవుట్ చేస్తే దాని ప్రభావం భారత జట్టుపై పడుతుందని, మిగిలిన జట్టుపై ఒత్తిడి తీసుకువచ్చి తేలికగా అవుట్ చేయవచ్చునేది వాటి ఆలోచనగా ఉంది. సచిన్‌లో మునుపటి సత్తా చెక్కుచెదరలేదనడానికి పాకిస్తాన్‌పై ఆడిన మ్యాచే తార్కాణం. అందుకే అతడంటే మిగిలిన జట్లకు హడల్. ఒంటి చేత్తో మ్యాచ్ దిశను మార్చగలడని ప్రతీతి. ఇందుకే అతడంటే అందరికీ అపారమైన గౌరవం, అభిమానం.

అయితే అతడూ మానవమాత్రుడే. అతనికీ కొన్ని బలహీనత లుంటాయి. ఒక్కొక్కసారి ఏకాగ్రత లేకపోవడంతోనో, క్రీడాకారునిగా బలహీనత కారణంగానో అతడు అభిమానులు పెట్టుకున్న అంచనాలకు భిన్నంగా తేలికగా అవుటవుతుంటాడు. దీనిని సాకుగా తీసుకుని అతనిపై విమర్శల జడివాన కురిపిస్తుంటారు అతని పేరును, ఆటతీరును ఓర్వలేని వారు. కీలకమైన మ్యాచ్‌ల్లో రాణించడని, అతడు ఆడితేనే గెలుస్తుందనుకునే మ్యాచ్‌ల్లో విఫలమవుతాడని అతనిపై వచ్చే సాధారణ విమర్శ. వరల్డ్‌కప్ ఫైనల్లో భారీ లక్ష్యం సాధించాల్సిన సమయంలో అతడు మొదటి ఓవర్‌లోనే అవుట్ కావడంతో విమర్శకులు మళ్లీ తమ గళాలకు పదును పెట్టసాగారు. చూశారా, మేము చెపుతూనే ఉన్నాం. కీలకమైన మ్యాచ్‌ల్లో అతడు ఆడలేడని, ఆడలేడనడం కన్నా ఆడడని అని వారు పేర్కొనసాగారు. ఇతరులకు పేరు వస్తుందనే దుగ్ధతో సచిన్ కావాలనే వికెట్ సమర్పించుకుంటాడని వారు వాకృచ్చారు. సచిన్ ఆటతీరు, అతనితో కించిత్ పరిచయం ఉన్న వారెవరూ ఇటువంటి అర్థంపర్థంలేని విమర్శలతో ఏకీభవించబోరు. సచిన్‌పై ఇటువంటి విమర్శలు రావడం ఇదే మొదటిసారి కాదు. ఇదే చివరిసారి కాబోదు కూడా. సచిన్ కెరీర్‌ను కూలంకషంగా పరిశీలిస్తే అతనిపై వచ్చే విమర్శల్లో నిజం ఏపాటిదో అర్థం అవుతుంది. ఎంతదాకో ఎందుకు. మొన్న జరిగిన వరల్డ్‌కప్ మ్యాచ్‌లనే తీసుకుందాం. కీలకమైన మ్యాచ్‌ల్లో సచిన్ ఆడడని ఎక్కువగా వినిపించే విమర్శ.

1. జింబాబ్వేపై జరిగిన మ్యాచ్ కీలకమైనది కాదని ఎవరు పేర్కొనగలరు. ఆ మ్యాచ్‌లో ఓడిపోతే భారత్ సూపర్ సిక్స్ రౌండ్‌కు కూడా చేరుకోలేక అవమానభారంతో ఇంటిముఖం పట్టాల్సి వచ్చేది. ఆస్ట్రేలియా చేతిలో ఘోరపరాజయం, అంతకుముందు హాలెండ్‌పై కూడా కళతప్పిన ఆటతో భారత జట్టు స్వదేశంలో నిరసన ప్రదర్శనలను ఎదుర్కొంది. ఈ నేపథ్యంలో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌కు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఈ మ్యాచ్‌లో సచిన్, సెహవాగ్ రాణించి ఉండకపోతే భారత్ 250 పరుగుల మార్క్ చేరి ఉండేది కాదు. ఈ మ్యాచ్‌లో విజయంతోనే భారత్ విజయయాత్ర ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌తో ప్రారంభమైన భారత్ వరుస విజయాలు సెమీఫైనల్ వరకూ కొనసాగాయి. భారత్ కప్ గెలుచుకు తీరుతుందని అభిమానులందరూ ఆశపెట్టుకున్నారంటే జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో సాధించిన విజయమే ముఖ్యకారణం. ఆమ్యాచ్‌లో సచిన్ 81 పరుగులు చేసిన విషయం విస్మరించగలమా? మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఎవరు?

2. ఇంగ్లండ్‌పై తరువాత జరిగిన మ్యాచ్‌కు కూడా అంతే ప్రాముఖ్యత ఉంది. ఇది కూడా భారత్‌కు తాడోపేడో తేల్చాల్సిన మ్యాచే. ఈ మ్యాచ్‌లో సచిన్ 52 బంతుల్లో

యాభై పరుగులు చేసి భారత జట్టు సంతృప్తికర స్కోరు సాధించడానికి దోహదం చేశాడు. తరువాత కార్యాన్ని నెహ్రా పూర్తి చేశాడు. సచిన్ విలువకట్టలేని ఇన్నింగ్స్‌ను విస్మరించడం ఉచితమా?

3. ఇక పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌కు ఉన్న ప్రాధాన్యతనెంతో ఇక్కడ వివరించడం అవసరమా? కాదుకదా. ఈ మ్యాచ్‌లో గెలిచి తీరాలని ఇరు జట్లపై తీవ్ర ఒత్తిడి ఉంది. ఎవరిని కదల్చినా పాకిస్తాన్‌పై గెలిస్తే చాలని, భారత్ కప్ గెలుచుకున్నా, లేకపోయినా తాము పట్టించుకోబోమని వచ్చిన ప్రకటనలను గమనించాము కదా! ఈ మ్యాచ్‌లో సచిన్ ఆడిన తీరు అతని మొత్తం క్రికెట్ కెరీర్‌కే మణిమకుటం అనడం సందేహం లేదు. అతడు షోయిబ్ అక్తర్, వసీం అక్రం, వకార్ యూనస్, రజాక్‌ను ఎదుర్కొన్న తీరు ఎవరైనా మరచిపోగలరా? సచిన్ ఇన్నింగ్స్ కారణంగానే భారత్ ఘనవిజయం సాధించగలిగింది. పాకిస్తాన్ మొదటి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టడానికి ఈ మ్యాచే కారణం అనడంలో సందేహం లేదు. ఈ మ్యాచ్ తనకు పీడకల వంటిదని అక్తర్ వ్యాఖ్యానించాడంటే సచిన్ ఆట అతనిపై ఏమేరకు ప్రభావం చూపిందో అర్థం చేసుకోవచ్చు కదా. అతడు గాయపడి కూడా రన్నర్‌ను పెట్టుకోకుండా ఆడాడు. ఎందుకంటారు? రన్నర్ వల్ల తన ఏకాగ్రత చెదురుతుందని అతడు భావించడమే ఇందుకు కారణం. దీనిని గ్రహించడానికి క్రికెట్ పరిజ్ఞానం అక్కరలేదు కదా.

4. శ్రీలంకపై అతడు ఆడిన అపూర్వ ఇన్నింగ్స్‌ను మరవడం సాధ్యమా? అతడు 97 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్ కీలకమైంది కాదా? శ్రీలంకపై సునాయాస విజయం సాధించడంతో రన్‌రేట్ మొదలైన బాదరబందీ లేకుండానే భారత్ ముందుకు దూసుకుపోగలిగింది.

5. కెన్యాపై సెమీఫైనల్లో సచిన్ చేసిన 83 పరుగుల ఇన్నింగ్స్‌కు ప్రాధాన్యత లేదని అనగలమా? సౌరవ్‌తో కలిపి నెలకొల్పిన భారీ భాగస్వామ్యం కారణంగానే కెన్యా అందుకోలేని లక్ష్యాన్ని భారత్ నిర్ధారించగలిగిన విషయాన్ని విస్మరిస్తే ఎలా? నమీబియా, హాలెండ్‌పై భారీ స్కోరు చేసి భారత జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించింది ఎవరు? సచిన్ కాదా? అందరూ భావించినట్లుగా ఈ రెండు జట్లు పసికూనలు కాదని వరల్డ్‌కప్‌లో నిరూపితమైంది. ఇంగ్లండ్ క్రీడాకారులను ఎవరైనా అడిగితే నమీబియా గురించి చెపుతారు.

6. పాకిస్తాన్, ఆస్ట్రేలియాపై తొలుత బ్యాటింగ్ ఎంచుకోవడం మంచిదని గంగూలీకి సచిన్ సలహా ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. జంకూ, బొంకూ లేకుండా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించే విశిష్టశైలి సచిన్ సొంతం. ఫైనల్లో బెదిరిపోయి వెన్నుచూపే కంటే పోరాడడమే మేలని సచిన్ భావించాడు. అందుకే మొదటి ఓవర్ నుండి ఎదురుదాడి ప్రారంభించాడు. ఇందులో అతడు విఫలం కావడం కేవలం కాకతాళీయం. ఇందుకు అతన్ని ఒక్కడినే ఆక్షేపించడం ఏమంత ఉచితం? మిగిలిన బ్యాట్స్‌మెన్ పోరాడి గెలిపించవచ్చు కదా. మరి సచిన్‌పైనే ఎందుకు విమర్శలు వస్తున్నాయి? 359 పరుగుల భారీ లక్ష్యాన్ని సాధించాల్సి ఉన్నప్పుడు తొలి నుండి విరుచుకుపడటం అవసరం. పాకిస్తాన్‌పై సచిన్ ఇలాగే ఆడాడు. రాణించాడు. అప్పుడు ఇంద్రుడు, చంద్రుడన్న నోటితోనే ఫైనల్లో విఫలమైతే విమర్శించడం యుక్తమా.

7. సచిన్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అనే విషయాన్ని విస్మరిస్తే ఎలా? ప్రపంచంలోని 154 మంది క్రీడాకారుల్లో సచిన్ నంబర్ వన్‌గా వచ్చాడు. ఇది భారత్‌కు గర్వకారణం కాదా? దాన్ని జీర్ణించుకోలేక దుగ్ధతో విమర్శలు చేయడం తగునా? సచిన్ రికార్డుల కోసమే ఆడతాడని మరో విమర్శలో కూడా నిజం లేదు. అతడు ఈ టోర్నమెంట్‌లో మూడుసార్లు సెంచరీకి చేరువలోకి వచ్చి అవుటయ్యాడు. ఈ మూడు సెంచరీలు కూడా చేస్తే సచిన్‌కు మరింత పేరు లభించి ఉండేది. అయితే సచిన్ దీనిని పట్టించుకోకుండా జట్టు ప్రయోజనమే ముఖ్యంగా భావించి వికెట్ త్యాగం చేశాడు. విమర్శలు చేసే ముందు అన్ని అంశాలను పరిగణించాల్సిన అవసరం లేదంటారా? ◆

'మేరా భారత్...'

* అల్లూరి రాజకుమారి

అర్ధరాత్రి :

నడన్‌గా మైక్‌లో పాటలు ప్రారంభమయ్యేసరికి ఉలిక్కిపడి నిద్రలేచారు జస్వంత్, జీవని.

"అబ్బ! ఏమిటీ గోల?" రెండు చెవులూ మూసుకుంటూ అంది జీవని.

"ఏముందీ! ఎలక్షన్స్ వస్తున్నాయిగా, పోటాపోటీగా ప్రచారాలు సాగుతున్నాయి. రేపు సాయంత్రం మన పక్క వీధిలోనే బహిరంగ సభకు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. బహుశా ఇది కూడా అందులోని భాగమే అయి ఉంటుంది. ఏం చేస్తాం? కళ్లు మూసుకుని పడుకో" అంటుండగానే బయటి నుండి కెవ్వుమని కేక వినిపించడంతో ఒక్కసారి ఉలిక్కి పడ్డారు.

"అరే! రామూ కేకలా వుంది, పాపం భయపడ్డాడేమో?" తలుపు తీసి బయటకు వస్తున్న జస్వంత్‌ని అనుసరించింది జీవని.

హాలులో నేల మీద పరచి వున్న రాముడి దుప్పటి ఖాళీగా కనిపించింది. వీధి తలుపు బార్లా తీసి వుంది.

"అరే! వీడు ఈ టైములో వీధి తలుపులు తీసుకుని బయటకు వెళ్ళడమేమిటి?" కంగారుగా బయటకు వచ్చిన జస్వంత్ ఎదురుగా కనిపించిన దృశ్యానికి నిర్ఘాంత పోయాడు.

ఎదురుగా నడిరోడ్డు మీద తెలివి లేకుండా పడి వున్నాడు రాముడు. కంగారుగా వాడిని చేతుల మీదుగా ఇంట్లోకి తీసుకుని వచ్చాడు. ఫాను వేసి మొహంపై నీళ్ళు చల్లిన తరువాత మెల్లిగా కళ్లు విప్పిన రామూ ఎదురుగా కనిపించిన జీవనిని పట్టుకుని బావురుమన్నాడు.

''దెయ్యం, అవెమ్మా! అమ్మగారూ! మనింటికి దెయ్యాలూ, భూతాలూ వచ్చేశాయమ్మా! దెయ్యాలు మనింటిని చుట్టుముట్టేశాయి" గజగజా వణికిపోతున్నాడు రామూ.

''ఏమిటా మతిలేని మాటలు? దెయ్యాలూ భూతాలూ ఏమిటి నాన్సెన్స్!" కసిరాడు జస్వంత్.

"నిజం, అమ్మగారూ!" అయ్యగారితో లాభం లేదని అమ్మగారితో అన్నాడు. "పాటలు వినిపిస్తే, ఏదో ఊరేగింపు జరుగుతోందని బయటకు వచ్చానమ్మా! రోడ్డు మీద ఎవరూ లేరు. కానీ, నా ముందు నిలబడి పాటలు పాడాయమ్మా. దెయ్యాలైతేనే కదమ్మా! కనిపించకుండా మాట్లాడతాయి, పాడతాయి."

"నీ మొహం దెయ్యాలు రావడమేమిట్రా! కలగానీ వచ్చిందేమిటి?" కసిరింది సౌమ్య.

''నిజం అమ్మగారూ! నిజంగానే దెయ్యాలూ, భూతాలూ ఉంటాయట. మా ఊళ్లో కిష్టిగాడు చెప్పాడు. అవి మామూలుగా స్మశానంలో వుంటాయట. అప్పుడప్పుడు బతికి వున్న మనుషుల రక్తం తాగాలనిపిస్తే ఊళ్ళోకి వస్తాయట. మెడ కొరికి రక్తం పీల్చేస్తాయట. అమ్మతోడు" తన మాటలు నమ్మమన్నట్లుగా రెండు చేతులు తల మీద పెట్టుకుని మరోసారి బావురుమన్నాడు.

ఈ హడావుడిలో మైకులోని పాట ఎప్పుడు ఆగిపోయిందో గమనించనే లేదు. అంత తేలిగ్గా మిమ్మల్ని వదులుతానా అన్నట్లుగా మళ్ళీ ఒక్కసారిగా హైవాల్యూంలో పాట మొదలైంది.

"అమ్మో! అదిగో, మళ్ళీ దెయ్యం తిరిగి వచ్చేసింది. చూడండి గాలిలోంచి పాటలు ఎలా వినిపిస్తున్నాయో? అమ్మో! దెయ్యాలూ, భూతాలూ మన ఇంటిని చుట్టుముట్టేశాయి. అదిగో! మీద పడి కరిచేస్తున్నాయి. అమ్మో! కంఠం పిసికేస్తున్నాయి. వద్దు, వద్దు నన్నేం చేయద్దు. నన్ను వదిలేయ్." రెండు చేతులతోనూ మెడను పట్టుకుని గగ్గోలు పెట్టేస్తున్నాడు.

"రామూ! రామూ!" కంగారుగా వాడి భుజాల మీద చెయ్యి వేశాడు జస్వంత్. కెవ్వుమంటూ కేకవేసి స్పృహ తప్పి పడిపోయాడు రామూ!

''మైగాడ్! మైక్‌లో పాట విని బెదిరిపోయినట్లున్నాడు వీడు. ఆ పాటలిప్పుడప్పుడే ఆగేటట్లు లేవు. వీడేమైపోతాడో? జీవనీ! తలుపులు జాగ్రత్తగా వేసుకో. వీడిని కుమార్ దగ్గరకు తీసుకువెడతాను" రామూని భుజం మీద వేసుకుని వీధి చివర వున్న సైకియాట్రిస్ట్ కుమార్ దగ్గరకు బయలుదేరాడు జస్వంత్.

* * *

మైక్ వాళ్ళకి నర్సింగ్‌హోమ్ వాళ్ళపై ప్రత్యేకమైన అభిమానం వున్నట్టుంది. హాస్పిటల్‌కి రెండు వైపులా మైకులు పెట్టారు. దానితో చెవులు బ్రద్దలయ్యేంత శబ్దం వస్తోంది.

'అబ్బ! హాస్పిటల్‌లో పేషంట్స్ ఎలా భరిస్తున్నారో, నిజంగా గుండె జబ్బు వాళ్ళకైతే వెంటనే గుండె ఆగిపోయేటట్లు వుంది' అనుకున్నాడు జస్వంత్.

నర్సింగ్‌హోంలో ఏదో ఎమర్జన్సీ వున్నట్లుంది. కుమార్, అతని భార్య సంఘమిత్ర హాస్పిటల్‌లోనే వున్నారు.

"ఏమిటయ్యా బాబూ! ఈ టైములో దిగబడ్డావు? ఎవరీ కుర్రాడు? ఏమైంది?" అడిగిన కుమార్‌కి వివరంగా అంతా చెప్పాడు.

"మైక్‌ని చూసి భయపడే వాళ్ళెవరయ్యా, బాబూ ఈ రోజుల్లో. ఇంకేమైనా జరిగిందేమో? నేను ఎగ్జామిన్ చేసి వస్తాను. నువ్వు ఇక్కడే కూర్చో!" అంటూ లోపలకు నడిచాడు కుమార్.

అరగంట తరువాత బయటకు వచ్చాడు కుమార్.

"ఎలా వున్నాడు?" ఆతృతగా అడిగాడు జస్వంత్.

"ఇంజక్షన్స్ ఇచ్చాను. పడుకున్నాడు. తెల్లవారిన తరువాత ఇన్వెస్టిగేషన్స్ చేయిద్దాం. నువ్వు చెప్పింది నిజమేనయ్యా! మైక్‌లో పాటలు వినే భయపడినట్లున్నాడు. అసలింతకూ అతగాణ్ణి ఎక్కడ నుంచి పట్టుకు వచ్చావు? ఇంతవరకూ ఆ కుర్రాడు మైక్‌లో పాటలు వినకపోవడం విచిత్రమే!"

"అందులో విచిత్రం ఏముంది? వాళ్ళది చాలా మారుమూల కుగ్రామం. ఇప్పటికి కూడా వాళ్ళ

ఊరికి కరెంటు దీపాలు లేవు. వీడు ఎప్పుడూ ఆ ఊరి పొలిమేరలు దాటిన వాడు కాదు. అందువల్ల మైక్‌ని చూసి వుండకపోవచ్చు. ఏదో ఇంట్లో సహాయంగా వుంటాడు కదా అని తీసుకువచ్చాం. ఏదో పట్నం చూడవచ్చునే సరదాలో తనూ వచ్చాడు. ఏదీ! ఇంతకూ వాడు వచ్చి రెండు రోజులే అయింది. ఈలోగా ఇలా జరిగింది. అయినా, ఇలా ఎప్పుడు పడితే అప్పుడు మైక్ పెట్టడమేమిటి? నిజంగా చాలా న్యూసెన్స్‌గా వుంది. ఇప్పుడు వీడికేమైనా అయితే వాళ్ళ వాళ్ళకి ఏం సమాధానం చెప్పను?"

''సరే, రోలు వచ్చి మద్దెలతో మొరపెట్టుకోవడమంటే ఇదే. మా ఆవిడకు గుర్రపు వాతంతో ఒక పేషంటు వచ్చింది సాయంత్రం. సరే, మందులతో ఫిట్స్ కంట్రోల్ చేసి 'అమ్మయ్య' అనుకునే సమయంలో హఠాత్తుగా మైక్‌లో పాటలు ప్రారంభం కావడంతో మళ్ళీ చాలా సివియర్‌గా ఫిట్స్ వస్తున్నాయి. సాధారణంగా గుర్రపు వాతం పేషెంటుకి ఏ మాత్రం శబ్దం వినిపించినా ఫిట్స్ ఎక్కువ అవుతాయి. ఇక, ఈ మైక్ శబ్దానికి చెప్పాలా? ఇక్కడ నర్సింగ్ హోంలో గుర్రపు వాతం కేసు వుంది. మైక్ ఆపమని మర్యాదగా కబురు చేశాం" అంటుండగానే లోపల నుండి డాక్టర్ సంఘమిత్ర హడావుడిగా వచ్చింది. "పేషెంటుకి విపరీతంగా ఫిట్స్ వస్తున్నాయి. ఏం చేద్దాం?"

"ఏం చేస్తాం? ముందు ఆ మైక్ ఆపితే తప్ప ఫిట్స్ కంట్రోల్ కావు" అంటుండగానే వెళ్లిన కాంపౌండర్ తిరిగి వచ్చాడు.

"రేపు సాయంత్రం బహిరంగ సభ వుందట. పార్టీ స్టేట్ ప్రెసిడెంట్, ఇతర స్టేట్ లెవెల్ రాజకీయ నాయకులు వస్తున్నారట. మైక్ టెస్ట్ చేస్తున్నారట. అందుకని ఆపడం కుదరదని చెప్పారు."

"నాన్సెన్స్!" చివాలున లేచాడు కుమార్. "ఇవేమైనా పార్లమెంట్ ఎలక్షన్సా? లేక అసెంబ్లీ ఎలక్షన్సా? పార్లమెంటు ఎలక్షన్స్ దగ్గర నుంచీ గ్రామపంచాయతీ ఎలక్షన్స్ వరకూ ప్రతీసారీ ఇలా జనాన్ని ఇబ్బంది పెట్టడమా ప్రజాసేవ అంటే...? వుండు. నేను వెళ్ళి చూసి వస్తాను. అసలు వీళ్ళు ఏమిటనుకుంటున్నారు? మనిషి ప్రాణాలంటే అంత చులకనా?" రాముకి ఇవ్వవలసిన ఇంజక్షన్స్ కాంపౌడర్‌కి చెప్పి బయలుదేరాడు కుమార్.

"ఒక్కడవూ వెళ్ళడం ఏమిటి ? ఉండు నేను కూడా వస్తాను" అంటూ కుమార్ స్కూటర్ వెనుక కూర్చున్నాడు జస్వంత్.

పార్టీ కార్యకర్తలు స్టేజ్ డెకరేషన్ చేస్తున్నారు. కొంతమంది కుర్చీలు సర్దుతున్నారు. మైక్ దగ్గర కొంతమంది గుమిగూడి వున్నారు. తిన్నగా మైక్ దగ్గరకు వెళ్లాడు జస్వంత్, కుమార్.

ఏమిటన్నట్లుగా చూశాడు ఎలక్ట్రిషియన్.

"ముందు ఒక్కసారి మైక్ ఆపవయ్యా బాబూ! నేను చెప్పేది నీకు వినిపించాలి కదా!' ఏ కళన వున్నాడో మైక్ ఆఫ్ చేశాడు.

"ఏమిటి ఆపేశావ్?" అంటూ వచ్చి మైక్‌ని మళ్ళీ ఫుల్ వాల్యూంలో పెట్టాడు. పాతికేళ్ళ కుర్రాడు.

"నేనే మీతో మాట్లాడాలని చెప్పి మైక్ ఆపమన్నాను. ఇంతకూ ఇప్పుడీ మైక్ గొడవేమిటి?"

"మీకు తెలియదా? రేపు సాయంత్రం బహిరంగ సభ వుంది కదా!"

"అర్ధరాత్రి పూట అంకమ్మ శివాలని రేపు సాయంత్రం జరగోయే సభకు ఈ అర్ధరాత్రి మా ప్రాణాలు తీస్తున్నారేమిటయ్యా చూడు బాబూ! పక్కనే హాస్పిటల్‌లో సీరియస్ కేసు వుంది. మీరు మైక్ ఆపితే తప్ప తను బ్రతకదు. దయచేసి మైక్ ఆపేయండి. మీ మైక్ టెస్ట్ రేపు ఉదయం చేసుకోండి" నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు జస్వంత్.

"చాల్లేవయ్యా! పెద్ద చెప్పొచ్చావ్? ఈ సభ కోసం మేం ఎన్ని రోజుల నుండి నిద్రాహారాలు మాని కష్టపడుతున్నామో మీకేమైనా తెలుసా! ఏదో ఒక్కరోజు నిద్ర పాడైపోయిందని గోల చేస్తున్నారు" దురుసుగా అన్నాడు మరొక యువకుడు. అప్పటికే అతను పీకలదాకా తాగి వున్నాడు. అతనే కాదు అతని తోటి వాళ్ళు కూడా చాలా మంది నిషాలోనే వున్నారు. ఎలక్షన్స్ పేరు చెబితే మద్యం ఏరులై పారుతుంది మన పవిత్ర భారతదేశంలో.

"వీళ్లు మన ఎగస్పార్టీ వాళ్లురా! అందుకే ఎలాగైనా మన సభని దెబ్బతీయాలని పేషెంటు వంక చెబుతున్నారు" అందుకున్నాడు మరో కార్యకర్త.

"అవును. మొన్న ఆ పార్టీ వాళ్ళు పెట్టినప్పుడు ఎవరూ మాట్లాడలేదు. ఈ వేళ మేం పెడితే వచ్చిందా?"

"బాబూ! ఆ పార్టీ వాళ్ళు పెట్టింది ఈ ఊళ్లో కాదు పక్క ఊరిలో" అన్నాడు సహనాన్ని కూడదీసుకుంటూ కుమార్.

"ఓహో! అలాగా బాబూ! ఆ ఊరిలో మనుష్యులు లేరా? మరి వాళ్లెందుకు అడ్డు చెప్పలేదో? వాళ్ళకంటే మీరెక్కడ నుండి అయినా దిగి వచ్చారా?" నిర్లక్ష్యంగా అన్నాడు ఒక కార్యకర్త.

"మేము మా కోసం చెప్పడం లేదయ్యా! పేషెంటు చావు బ్రతుకుల మధ్య వుందంటే వినిపించుకోవేమిటి ? అర్థం చేసుకోవేమిటి?" చిరాగ్గా అన్నాడు కుమార్.

"ఏమిటయ్యా! ఊరుకుంటున్న కొద్దీ రెచ్చిపోతున్నారు. మీరు అపోజిషన్ పార్టీ వాళ్ళు. మా సభను పాడు చేయడానికే వచ్చారు. మేమేమీ గాజులు తొడుక్కుని కూర్చోలేదు. మైక్ ఆపేయడానికి" మీద మీదకు వచ్చాడు ఒక యువకుడు.

"చూడు బాబూ! మా కుర్రాడు ఇప్పటికే ఈ శబ్దానికి స్పృహ తప్పి పడిపోయాడు. మరో స్త్రీ చావు బతుకుల మధ్య వుంది. మీకు అనుమానంగా వుంటే ఒక్కసారి నర్సింగ్‌హోంకి వచ్చి చూడండి." అన్నాడు జస్వంత్.

"వీల్లేదు. మీకు దిక్కు వున్నచోట చెప్పుకోండి. మేము మాత్రం ఆపం. ఒరేయ్! అలా చూస్తూ నిలబడతావేమిటయ్యా! మరో కాసెట్ పెట్టు."

''సరే! ఎంత చెప్పినా మీరు వినిపించుకునే స్థితిలో లేరు. నేను మరోసారి చెబుతున్నాను. మైక్ ఆపకపోతే ఈ వ్యవహారం పోలీసుల దాకా వెళుతుంది" బెదిరించాడు కుమార్.

"అహ్హహ్హా!" పగలబడి నవ్వారు అక్కడ వున్న వారంతా.

"డాక్టరు గారూ! పేషెంటు పరిస్థితి చాలా సీరియస్‌గా ఉంది డాక్టరమ్మగారు మిమ్మల్ని వెంటనే రమ్మంటున్నారు'' పరుగున వచ్చి చెప్పాడు కాంపౌండర్.

"మైగాడ్!" కంగారుగా బయలుదేరారు స్నేహితులిద్దరూ.

''మన మీటింగుని ఎలాగైనా దెబ్బతీయాలని చూస్తున్నారు వీళ్ళు. లేకపోతే, ఎక్కడైనా మైక్ శబ్దానికే ప్రాణాలు పోతాయా? వాళ్ళలా చెబితే మనం నమ్మేస్తామనుకుంటున్నారు పిచ్చివాళ్ళు" వెనక నుండి వాళ్ళ మాటలు వినిపిస్తూనే ఉన్నాయి.

హాస్పిటల్‌లో పరిస్థితి చాలా ఉద్రిక్తంగా వుంది. పేషెంటు పరిస్థితి ప్రమాదకరంగా వుందని తెలుసుకున్న వారి తాలూకు మనుషులతో హాస్పిటల్ కిటకిటలాడుతోంది. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పలేని నిస్సహాయ స్థితిలో తలవంచుకుని కూర్చుంది.

డాక్టర్ కుమార్ రావడం గమనించిన వారంతా అతన్ని చుట్టుముట్టారు. కుమార్‌కి అప్పటికే సహనం పూర్తిగా నశించి పోయింది.

"ఆ మైక్ శబ్దాలు ఆగితే తప్ప ఆమెకు ఫిట్స్ కంట్రోలు కావు. మేం చేయగలిగిందేమీ లేదు. మీకు చేతనైతే వెళ్ళి వాళ్ళతో ఈ న్యూసెన్స్ ఆపించండి."

"మీ మాటే వినిపించుకోని వాళ్ళు మా మాటలు వింటారా బాబూ!" ఒక నడివయసు వ్యక్తి అన్నాడు.

"వాళ్ళు ఆపడమేమిటి? పదండి మనమే ఆపేద్దాం." ఆవేశంగా బయలుదేరిన ఒక యువకుణ్ణి అనుసరించారు మిగిలిన వారంతా.

అందరూ కేకలు వేసుకుంటూ రావడం గమనించిన ఆ పార్టీ కార్యకర్తలు వాళ్ళ పార్టీ వాళ్ళను సన్నద్ధం చేశారు. మాటామాటా పెరిగింది. ఒకరిమాటను ఒకరు వినే పరిస్థితిలో లేరు. మాటలతో ప్రయోజనం లేదని మైక్ సెట్‌ని ధ్వంసం చేశారు ఇవతలివారు. దానితో రెచ్చిపోయిన కార్యకర్తలు కర్రలు తీసుకున్నారు. ఇరువైపుల వారూ బలాబలాలు చూసుకున్నారు. తలలు పగిలాయి.

మీటింగు జరగవలసిన ప్రదేశంలో నెత్తురు ఏరులై పారింది. సహజంగానే అంతా అయిపోయిన తరువాత రంగ ప్రవేశం చేశారు పోలీసులు.

రెండు రాజకీయ పార్టీలూ పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకోవడానికి వ్యూహం పన్నుతున్నాయి. ఫిట్స్ వచ్చిన పేషెంటు మృతి చెందింది. ◆

పుస్తక పరిచయం

పృథ్వి పురిటి వేదన జలగీతం



జలగీతం

రచన : డా॥ ఎన్.గోపీ; **వెల :** రు. 50/-,
ప్రతులకు : శ్రీమతి ఎన్.అరుణ, 15-1/5డి, శ్రీనివాసపురం, రామాంతపూర్, హైదరాబాద్; విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

యాంత్రిక జీవితాన్ని గడిపేనుకోవడాన్కి అలవాటు పడ్డామనిపిస్తుంది. సహజత్వం నుంచి కృత్రిమత్వానికి పరుగు తీస్తున్న జనం ఒక వైపు, తనది గాని తనాన్ని తనదిగా చిత్రించుకునే అనివార్య పరిస్థితిలో ఉన్నాం మనం. కరువుతో అల్లాడిపోతున్న జన జీవిత చిత్రపటం డా॥ ఎన్.గోపి జలగీతం.

మానవ మనుగడలోని వింతపోకడను ప్రశ్నిస్తూనే నిజాయితీగా గోపి ఇలా అంటాడు. నీటి విలువ/ ఎడారిలో ఉన్నవాళ్లకు తెలుస్తుంది/ భూమ్మీద కూడా స్వార్థంరూపంలో/ ఆక్టోపస్‌లుంటాయని/" మానవజాతి మొత్తాన్ని కవిత్వీకరించడం నేర్చుకున్న కవిగా కన్పిస్తాడు. ఈ దీర్ఘకవితలో కాలుష్య కారణాన్ని చెప్తూనే హెచ్చరిస్తాడు

ఆత్మీయత – అనుబంధం, సంబంధాన్ని చక్కగా ఒడిసి పట్టినట్లుండే ఈ పంక్తుల్ని చదివితే కన్నీళ్లు రాక మానవు. సైబీరియా నుండి ఎగిరొచ్చే కొంగలది జలానుబంధమే/జనని గర్భంలో/ నవమాసాలు ఈదేది ఉమ్మనీటిలోనే. మరిలాంటప్పుడు మనిషికెందుకంత పొగరు. ప్రతీ విషయంలోనూ అధికారాన్ని, ఆధిక్యతనూ స్పష్టపరుస్తాడు. చివరికి భంగపడటాన్ని ఈకవి నిరసిస్తాడు. మేఘాలు తనువు చాలించాయి/కన్న వారికి కడుపు కోత మిగిల్చాయి. భావగర్భితమైన పదాలతో తనదైన అనుభూతిని అక్షరీకరించాడు. సున్నిత మనస్సును ప్రస్ఫుటం చేయగలడీకవి. "మనిషీ! నేను జలాన్ని/తరిగి పోతున్న అమృతాన్ని" అంటూ తడారుతున్న గొంతుతో హెచ్చరికలు చేయడమూ బాగుంది.

"దుర్భిక్షానికీ సుభిక్షానికీ మధ్య నున్న వ్యత్యాసమే" నీటి విలువ/ ఇంతకన్న నీటి విలువను/ఏలా చెప్పగలం. సూక్ష్మ పదాల్లో పూర్తి భావాన్ని నింపడం గోపి కవితా ప్రక్రియలో నిండుదనాన్నిచ్చింది.

కరువుతో అల్లాడిపోతున్న జనాన్ని ఎక్స్‌రే తీసిన కళ్లు గోపివి. అందుకేనేమో "మంచినీళ్లు లేవు/ఉన్న నీళ్లు మంచివికావు". అని అనగలిగాడు. రైతు కళ్లల్లో నీళ్లు తప్ప వర్షపు నీళ్లకి దూరమైన స్థితిని ఆర్ద్రతతో చెప్పాడు. పిల్లల బాల్యం శల్యమైంది/యువకులు అకాల వృద్ధులయ్యారు దానిపేరు ఫ్లోరిన్ అంటూ ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్న జనాన్ని గుండెకు హత్తుకొని ఆవేదనను వ్యక్తపరిచారు.

మానవ మాత్ర కాలుష్యం వల్లనే ఇదంతా అన్నట్లు చెప్తూనే మనమేం చేయాలి? "నదులను కాపాడితేనే/జలపాతాలు బతుకుతాయి" అని చెప్పడంలో మన తప్పిదానికి ప్రాయశ్చిత్తం కలగాలని కోరుకుంటారు.

ప్రకృతిపై ప్రేమను చూపించడం అందరూ చేసేపనే. కానీ కన్నీళ్లని ప్రేమించడం ఈ కవి గొప్పతనం. "అమ్మాయీ! పిల్లవాడిని, ఏడ్వనివ్వకు/దేహంలో నీళ్లు అయిపోతాయి." కరువుతో ఊళ్లు వదిలిపోతున్న జనాన్ని చూసి తల్లడిల్లిపోతాడీకవి. పట్నంలో పుట్టినోళ్లకు పల్లెకష్టాలు తెలియకపోవడంలో ఆశ్చర్యం లేదు. అందుకే "పట్నంలో పుట్టడం లోపం కాదు / పల్లెల్ని మర్చిపోవడం పాపం" అనడంలో గొప్పనైన తత్వం ఉంది. పల్లెనీ, తల్లినీ మరువద్దనే ఉద్బోధ ఉంది.

అన్నింటినీ మించి నీటిపై, కన్నీటిపై ఆప్యాయత, ఛిద్రమవుతున్న బ్రతుకులపై ఆవేదన, పచ్చదనాన్ని పాడుచేస్తున్న గ్లోబలీకరణపై ఆక్రోశమూ ఉంది. అందుకే డా॥ ఎన్.గోపి ఈ దీర్ఘకవితను పృథ్వి పురిటి నొప్పుల పాటగా విన్పించారు. మరింత సాహిత్యాన్వేషణలో చురుకైన సాహిత్యాన్ని అందించాలని కోరుకుందాం.

*** వేము**

వైవిధ్యమైన కథాసంకలనం

వ్యక్తి కంటే వ్యవస్థ గొప్పది. కానీ నేటి అత్యాధునికమనుకునే ఈ సమాజంలో వ్యక్తిత్వాన్ని కాక వ్యక్తి హోదాల్ని ప్రేమిస్తున్నారు. డబ్బున్న వాడిని, పవరున్న వాడ్ని పడిపడి ప్రేమిస్తున్నారు. ఇదే విషయాన్ని ఉషారాణి భాటియా తన కథా సంకలనం వంతెనలో కళ్లకు కట్టినట్లు చిత్రించారు.

వంతెన

రచన : ఉషారాణి భాటియా;
వెల : రు.50/-,
ప్రతులకు : ప్రాచీ పబ్లికేషన్స్, 3-3-859/1/ఏ, రెండవ అంతస్తు, ఆర్యసమాజ్ ఎదురుగా, కాచిగూడ, హైదరాబాద్.

సాహిత్యంలో కవయిత్రిగా, సంపాదకురాలిగా, జర్నలిస్టుగా, సుపరిచితమైన ఈమె రచయిత్రిగా అప్పుడప్పుడూ రాసిన కథల్ని సంకలనంగా తీసుకొచ్చారు. మొత్తం ఇరవై కథలున్నాయి ఇందులో. అరవైల నుండి తొంబైలదాకా మూడు &ఆలాలు కళ్లముందర మెదుల్తాయి. ఈ కథలు చదివే...

ఈ కథల్లో ఇతి వృత్తాలు మనచుట్టూ వున్నవే. ఏమంత వర్ణనలు, అతిశయోక్తులు, అనవసర ట్విస్టులూ లేకపోవడం చదువరులకు కథ చదువుతున్నట్లుగా కాక నిజజీవితాల్ని తడుముతున్నట్లుగా అన్పిస్తుంది. ఏ ఇజాలకు కట్టుబడకుండా మానవ సంబంధాలు వలుచనవుతున్న విధమును నింపుకున్నాయికథలు.

నాటి సమాజంలో ఆడపిల్ల నలుగురితో మాట్లాడటం తప్పు. కనీసం ఇల్లు విడిచి బజారుకెళ్లాలన్నా మగ తోడు కావాల్సిందే. అలాంటిది నేడు స్త్రీలు పురుషులకేమాత్రం తగ్గకుండా అన్ని రంగాల్లో తమ నైపుణ్యాన్ని నిరూపించుకుంటున్నారు. ఇప్పుడు గతంలో లాగా, ప్రాచీన కాలంలోని ఆడపిల్లల్లాగా నేటి ఆడపిల్లలు భయపడటం లేదు. పరిస్థితుల్ని అవగతం చేస్కొంటున్నారు. తమ కనుగుణంగా మల్చుకుంటున్నారు. వారికి అవకాశం ఇస్తే చాలు అని చెప్పిన కథ 'రాధ భయపడుతోంది'.

మనుషుల మధ్య పెరిగి పోతున్న గోడలు కూలిపోవాలని ఆశించే ఇతివృత్తంతో ఎంతో హృద్యంగా రాశారు. వంతెన కథ. పాత్రలను గాలిలో ఊరేగించుగా, వెన్నెల రాత్రుల్లో ఆడించక వాస్తవికంగా అచ్చం పల్లెటూరి అమ్మాయిల్లా చిత్రించడం ఆకట్టుకొనేట్టుంది. "అదిగో ఆ మూడో ఇల్లు, ఆ ఇంటి యజమానే నా ఈ స్థితికి కారణమని ఆ ఇంటావిడకే పనిపిల్ల చెప్తే ఏమౌతుంది." అంతేకాదు. దేవుడి గుడిలో నాకేం కావాలో కోరుకొమ్మని సలహా ఇచ్చిన ఆమే ఆ పనిపిల్ల కోర్కెను నెరవేర్చాలని కోరుకుంటుందా? లేదా పని మనిషే కదా అని ఊరుకుంటుందా? ఎలా జరుగుతుందోనన్న టెంపోని చక్కగా నిలబెట్టి చివరకు అంతే వేగంగా సమాజాన్ని ఆలోచింపమని చెప్పిన కథ "దేవుడి ఇల్లు".

"వాళ్లకి కావలసింది పార్వతి కాదు. పార్వతి మొగుడి జీతం, కారు మోడల్, ఆమె దేహం మీదున్న నగలు....... పార్వతి పార్వతిగా ఎవ్వరికీ అక్కర లేదు" ఈ మాటలు చాలు ఉషారాణి భాటియాను మంచి కథకురాలిగా చెప్పుకోవడానికి.

శిలకి ఓ ఆకృతి రావాలంటే ఉలి పోటు తప్పదు. నేటి సాహితీ ప్రక్రియా ప్రవాహంలో నిలబడాలంటే మరింత పకడ్బందీగా చూసుకోవాలనిపిస్తుంది కొన్ని కథల పేలవమైన పేర్లని బట్టి. కొన్ని కథల పేర్లు కథ మొత్తాన్ని ప్రతిబింబించే విధంగా లేవు.

ఏమైనప్పటికీ పాత తరమనిపించే కొన్ని కథల్ని పక్కన పెట్టినా వంతెన, వారసుడు, ఆక్షణం వంటి కథల్లో స్పష్టత, క్లుప్తత, ఇతివృత్తం పరంగా కొత్తదనాన్ని చూపించిన ఉషారాణి భాటియా నుండి మరిన్ని కథలు రావాలని కోరుకుందాం.

*** సైదులు ఐనాల**